సాక్షి చిత్తూరు

గురువారం । 29 । మే । 2025



మామిడికి గిట్టుబాటు ధర

తోతాపురి మామిడికి త్వరలో గిట్టుబాటు ధర నిర్ణయిస్తామని రైతు సంఘాలకు కలెక్టర్ హామీ ఇచ్చారు. - 8లో



'మహా'అగచాట్లు

కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులు తరలించడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. - 8లో



వాహన దొంగలు అరెస్టు

ట్రాక్టర్ సహా 6 బైక్‌లను దొంగలించిన ఇద్దరిని గుడిపాల పోలీసులు అరెస్టు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

విగ్రహ పునఃప్రతిష్టాపనకు ఆహ్వానం



కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 30న చేపట్టే శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్టాపనకు విచ్చేయాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు. బుధవారం కాణిపాకం ఆలయ ఏఈఓ రవీంద్రబాబు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి ఆహ్వానం అందజేశారు. ఏఈవో మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహంను పునఃప్రతిష్టాపన చేస్తామన్నారు. మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం వేద పండితులు కలెక్టర్‌కు వేద మంత్రాలతో ఆశీర్వదించి ఆలయ ప్రసాదంను అందజేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ నుంచి 'టీబీ ముక్తభారత్'

చిత్తూరు రూరల్(కాణిపాకం) : జిల్లాలో జూన్ నెల మొదటి వారం నుంచి టీబీ ముక్తభారత్ కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఎంహెచ్ఓ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఎంఎల్‌పీహెచ్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో జూన్ మొదటి వారం నుంచి వంద రోజుల పాటు టీబీ ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. హైరిస్క్ జనాభా ఉన్న ప్రాంతంలో 60 ఏళ్లు పైబడిన వారందరికీ మధుమేహం, బీపీ, మద్యం తాగే వారికి, గతంలో టీబీ ఉన్నవారికి టీబీ స్క్రినింగ్ పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

ఎంపీహెచ్ఓలకు పూర్తయిన కౌన్సెలింగ్



నియామక పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఎంపీహెచ్ఓలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 92 మందికి డీఎంహెచ్ఓ సుధారాణి సమక్షంలో కౌన్సెలింగ్ చేశారు. సాయంత్రానికి కౌన్సెలింగ్ పూర్తి చేసి హైరిస్క్ ప్రాంతాల్లో పనిచేసేలా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి -అపోలోపై విచారణ

– జూన్ 3వ తేదీన కమిటీ రాక

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి–అపోలోలో జరుగుతున్న లోపాలు, నిర్వహణ తదితర అంశాలపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఓ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో రాష్ట్ర డీఎస్‌హెచ్ రమేష్‌నాథ్, డిప్యూటీ కమిషనర్ రమేష్ కిషోర్, రాష్ట్ర వైద్యవిధాన కార్యదర్శి పద్మకుమారి, రాష్ట్ర డీఎస్‌హెచ్ ఈఈ విజయ భాస్కర్, రాష్ట్ర డీఎస్‌హెచ్ బయో మెడికల్ ఇంజినీర్ సందీప్‌రెడ్డిని నియమించింది. వీరు జూన్ 3వ తేదీన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రానున్నారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు.

వేరుశనగ విత్తనం పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)





అగ్రిల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో రైతు సేవలను నిర్వీర్యం చేసింది. హలం పట్టిన కర్షకులను దగా చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలకు కోతలు పెడుతూ వస్తోంది. రైతు భరోసా కేంద్రాలను అలంకారప్రాయం చేసింది. కియోస్క్ మిషన్లను మూలన పడేసింది. రైతుకు కావాల్సిన ఎరువులు అందజేయడంలో ముఖం చాటేసింది. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కేలా చేసింది. పంట బీమాకు ఎసురు పెట్టింది. పరిహారాన్ని పరిహాసం చేసింది. మళ్లీ పంటలు వేయాలంటే భయపడేలా చేసింది. ఏటా పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పి సర్వేల పేరుతో కాలయాపన చేస్తోంది. ఇలా కూటమి ప్రభుత్వంలో రైతన్నకు చేసిన దగా చెప్పుకుంటూ పోతే బోలెడు సమస్యలు.. కానీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే సేవలు అందజేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. రైతు సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి అన్నదాతకు ఆర్థిక భరోసా ఇచ్చారు. నాడు వ్యవసాయం రైతుకు పండుగలా మార్చింది. నేడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమ్మో..వ్యవసాయమా అనేలా చేసింది.

– కాణిపాకం



తొట్టంబేడు: మూతపడిన సాంబయ్యపాలెం ఆర్బీకే

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు కళకళ
- రైతు ముంగిటకే సేవలు
- నాడు వ్యవసాయం పండగ.. నేడు దండగ
- అన్నదాతపై కూటమి దగా
- రంజిపని రబీ.. కరుణించని ఖరీఫ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవలు నిర్వీర్యం
- నేడు కన్నీరుపెడుతున్న కర్షకులు

సాగు.. వెనకడుగు



– ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు గోవర్ధన్. ఇతనిది కార్వేటినగరం మండలం పాదిరి కుప్పం గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం ద్వారా మొత్తం రూ.8,60,000 లబ్ధి పొందాడు. రూ.7. 50 లక్షల విలువ చేసే ట్రాక్టర్. వేరుశనగ విత్తనం సబ్సిడీ కింద రూ. 10500. రైతు భరోసా పథకం కింద రూ. 39,500. యంత్ర సాయం పథకం కింద రోటోవేటర్‌కు రూ.10000. మడకలు రూ.16000. అదేవిధంగా యంత్ర సహాయక పథకం కింద వ్యవసాయానికి ట్రాక్టరుకు కావాల్సిన బ్లేడ్లు రూ. 34000 సబ్సిడీ పొందానని రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



– ఈయన పేరు సుబ్రహ్మణ్యం రెడ్డి, పలమనేరు నియోజకవర్గం కొంగవులపల్లి గ్రామం. గతంలో పంటకు కావలసిన ఎరువులు పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల్లో తీసుకునేవారు. ఇప్పుడు ఆ సౌకర్యం లేక ప్రైవేటు దుకాణాల్లో వ్యయ ప్రయాసలు కోర్చి ఎరువులు, మందులు తీసుకొంటున్నాడు. దీంతో అధికంగా డబ్బు ఖర్చు అవుతోందని చెబుతున్నాడు. ఖరీఫ్‌నకు గత ప్రభుత్వంలో రైతు భరోసా వచ్చేదని, ఇప్పుడు ఎలాంటి ప్రభుత్వ సహాయం దక్కడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టకాలమే అని ఆవేదన వ్యక్తం చేశాడు.

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

నాడు సంక్షేమం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండుగలా చేసింది. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతు ముగింటకే సేవలను తీసుకొచ్చింది.

• వ్యవ'సాయం'

జిల్లా వ్యాప్తంగా సుమారు 4.20 లక్షల హెక్టార్లల్లో వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 3 లక్షల హెక్టార్ల వరకు వివిధ రకాల పంటలు సాగవుతోంది. వెబ్‌ల్యాండ్‌లో 3,86,023 మంది రైతులు నమోదయ్యారు. వీరిలో 2 లక్షలకు పైగా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. వీరిలో 1.80 లక్షల మంది రైతులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరి సేవలకు ఎలాంటి డోకా ఉండేది కాదు.

• నాడు వ్యవసాయానికి పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధానంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ..రైతు భరోసా కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ కేంద్రాల్లో రైతులు ఎరువుల కోసం కియోస్క్ మిషన్ ద్వారా బుక్ చేసుకుంటే పల్లె ముగింటకే ఎరువులు విత్తనాలను రైతులకు అందించారు. పెట్టుబడి సాయంగా రైతు భరోసా పేరుతో ఏటా రూ.13,500 రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేసింది. ఐదేళ్ల కాలంలో 2,31,144 రైతులకు గాను రూ.886.31 కోట్లు వెచ్చించింది.

• రూ.67 కోట్ల పరిహారం

పంటకు బీమా కల్పించడంతో పాటు పరిహారంను పక్కాగా అందించేది. ఇలా అయిదేళ్ల కాలంలో 1,77,526 మంది రైతులకు గాను రూ.67.0 కోట్లు వ్యయం చేసింది. పండించిన పంటను గిట్టుబాటు ధర కల్పించింది.

• అగ్రిల్యాబ్‌లతో మెరుగైన సేవలు

అగ్రిల్యాబ్‌తో మేలైన సేవలను అందించింది. ఈ ల్యాబ్స్ ప్రస్తుతం నగరి, పలమనేరు నియోజకవర్గాల్లో పని చేస్తున్నాయి. పూతలపట్టు, జీడీ నెల్లూరు, కుప్పం తదితర నియోజకవర్గాల్లో ల్యాబ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇక రైతులను 494 గ్రూపులుగా ఏర్పాటు చేసి... ఆ గ్రూపులకు రూ.11.24 కోట్ల వ్యయంతో యంత్ర పరికరాలు అందజేసింది.

• ఉచితంగా వ్యవసాయ బోర్లు

వైఎస్సార్ జలకళ పేరుతో రైతులకు ఉచితంగా బోర్లు వేయించింది. జిల్లా వ్యాప్తంగా రూ.2.26 కోట్లతో 226 మందికి బోర్లు వేయగా 193 బోర్లల్లో పుష్కలంగా నీళ్లు పడ్డాయి. 33 బోర్లలో నీళ్లు రాలేకపోయింది. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు రాయితీపై డ్రోన్లు అందజేశారు.

నేడు సంక్షోభం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అన్నదాతకు సహకారం అందించక నిర్లక్ష్యం చేస్తోంది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వలు శూన్యం. పంట బీమా లేదు..పరిహారం అందలేదు.. మళ్లీ పంటలు వేయాలంటే రైతులు జంకుతున్నారు. పెట్టుబడి పెట్టే స్తోమత లేక కొందరు అప్పులు చేస్తే..మరికొందరు బీడు భూములుగా వదిలేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన సుఖీభవ ఇవ్వకపోగా... దుఃఖాన్ని మాత్రమే మిగిల్చింది.

• జూన్ సమీపించినా విత్తనాలేవీ..

జూన్ నెల ప్రారంభం నుంచి వేరుశనగ విత్తనాలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఇంత వరకు రైతులకు విత్తనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఏటా 40 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సరఫరా చేస్తే ఈసారి 26,350 క్వింటాళ్ల విత్తనాల ప్రతిపాదనలతో సరిపెట్టుకుంది. 13 వేల క్వింటాళ్ల విత్తనాలకు కోత పెట్టింది. వేరుశనగ విత్తనాలతో పాటు ఇస్తున్న కంది, అలసందలు, జనుములు, మినుములు వంటి విత్తనాల ఊసే లేదు. ఖరీఫ్ ప్రారంభమైన ఇంత వరకు పంట రుణాలు ఇవ్వడంలో ఎలాంటి స్పష్టత లేదు.

• మామిడి రైతుకు మొండిచేయి..

మామిడి ధరలు డీలా పడుతున్నాయి. గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. 2024 జూన్ తర్వాత తయారైన గుజ్జు నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే అమ్ముడుబోయాయి. మిగిలిన గుజ్జు అలానే మూలకు పడింది. వాటి ఎగుమతికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదు. పరిశ్రమదారులకు రుణాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. టమోట ధరలు పతనమవుతున్నా చోద్యం చూస్తోంది. చెరకు సాగులో బెల్లం తయారీకి ఆంక్షలు విధిస్తోంది. దీంతో బెల్లం తయారు చేయాలంటే రైతులు వెనకడుగు వేస్తున్నారు. చెరకు సాగును నిలిపి వేయాలని చూస్తున్నారు. ఏడాది కాలంలో పొలం బడులకు మంగళం పాడింది. కాగా కూటమి ప్రభుత్వం ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలను కుదించేందుకు సర్వం సిద్ధం చేసింది.

• రైతుల కంట తడి

ఇప్పుడు పండించేందుకు అవసరమైన విత్తనాల కోసం పడిగాపులు పడుతున్నారు. పెట్టుబడి సాయం కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.





డ్రోన్లతో పిచికారీపై అవగాహన , గత ప్రభుత్వంలో ఎరువులు ఇలా..(ఫైల్)





మత్తేరిమట్లలో నిర్మించిన రైతుసేవా కేంద్రం, బోసిపోయిన మామిడి మార్కెట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయిదేళ్లల్లో రైతు భరోసా జమ వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	రూ.కోట్లల్లో
2019-20	220256	165.19
2020-21	231083	173.52
2021-22	216594	162.45
2022-23	223165	211.12
2023-24	231144	174.03

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటల బీమా, పరిహారం వివరాలు

సంవత్సరం	రైతులసంఖ్య	రూ.కోట్లల్లో
2019	5311	6.4
2020	3520	2.1
2021	55773	17
2022	63624	31.6
2023	49298	9.9

యంత్ర పరికరాల వివరాలు

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	రూ.కోట్లల్లో
200-21	258	7.07
2022-23	236	4.17

వేరుశనగ విత్తనాల పంపిణీ

సంవత్సరం	క్వింటాళ్లల్లో
2019-20	29978.1
2020-21	84070.9
2021-22	8109.5
2022-23	42288
2023-24	41070.3
2024-25	42202.5(మే లోపు)

వైఎస్సార్ జలకళ వివరాలు

మొత్తం దరఖాస్తులు -	226
డ్రిల్ చేసిన బోర్ల సంఖ్య -	226
నీళ్లు వచ్చిన బోర్లు -	193
నీళ్లురాని బోర్లు -	33
బోరు వేయడానికి వ్యయం -	రూ.2.26 కోట్లు



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సాగు, పరిహారం, విత్తనాల వివరాలు.. (మే తరువాత)

రైతు భరోసా కేంద్రాల సంఖ్య -	502
గతేడాది జిల్లాలో వేరుశనగ సాధారణ విస్తీర్ణం -	13,044
వేరుశనగ పంట నష్టం -	9 వేల హెక్టార్లు
అత్యంత కరువు మండలాలుగా -	3
మధ్యస్త కరువు మండలాలు -	13
పంట నష్టం విలువ రూ.15.42 కోట్లు	
తుపానుకు వరి పంట నష్టం 523.517 హెక్టార్లు	
నష్టం విలువ -	రూ.90.05 లక్షలు
ఈ ఏడాది ఖరీఫ్‌సాగు విస్తీర్ణం -	71,305
వేరుశనగ సాధారణ విస్తీర్ణం -	35,228
మొత్తం రైతుల సంఖ్య -	1.80 లక్షలు
వరి సాగు చేసే రైతుల సంఖ్య -	90 వేలు
జిల్లాకు అవసరమైన విత్తనాలు -	40,338క్వింటాళ్లు
ప్రస్తుతం విత్తన కేటాయింపు -	26,350క్వింటాళ్లు
కోత పెట్టిన విత్తనం -	13,988క్వింటాళ్లు

గత ప్రభుత్వం దయతో ఆనందంగా ఉన్నాం



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జలకళ పథకంలో బోరు వేశారు. మాకు సర్వే నెంబర్ 49/3లో 2.70 సెంట్ల భూమి ఉంది. కొన్నేళ్లుగా బోరు లేకుండా భూమి సాగు చేసి, పంటలు వేయలేక ఇబ్బంది పడ్డాం. మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్ రెడ్డి జలకళ పథకంలో మాకు ఉచిత బోరు వేశారు. ప్రస్తుతం ఒక ఎకరాలో మామిడి తోట, 1.70 సెంట్ల వరి సాగు చేసుకుంటున్నాం. ఆనందంగా ఉన్నాం.

– నాగలక్ష్మి, పాలసముద్రం మండలం

ఇంత వరకు విత్తనాలు ఇవ్వలేదు..



గత ప్రభుత్వంలో సమయానికి చేతికి భరోసా డబ్బులు పడేవి. విత్తనాలు ఇచ్చేవారు. చినుకు పడితే దుక్కులు దున్ని విత్తు విత్తుకునే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంత వరకు విత్తనాలు లేవు. అన్నదాత సుఖీభవ అన్నారు. అదీ ఇవ్వలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసే పరిస్థితి కనిపించడం లేదు.

– హరి ప్రసాద్, రైతు కూలీ, కాసిరాళ్ల

ఇప్పటి వరకు ధర ఖరారు చేయలేదు..



గత ప్రభుత్వంలో మే నెల మొదటి వారంలోనే విత్తనాలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇప్పటి వరకు విత్తనాలు ఇవ్వలేదు. ఇప్పుడు విత్తనాలు ఇస్తే మేము ఎప్పుడు కాయలు వలుచుకొని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. ముగసల కార్తిలోపు వేస్తే పంటలు బాగా పండుతాయి అని పూర్వీకుల నుంచి సంప్రదాయం. ప్రభుత్వం ఇప్పటికీ ధరే ఖరారు చేయలేదు. ఇక కాయలు ఎప్పుడిస్తారో తెలియదు.

– రంగనాథ్ , చౌడేపల్లి మండలం

ఏడాదిలో ఒక పైసా అందలేదు..



నాకు ఎకరా పొలం ఉంది. గత ప్రభుత్వంలో పంట సాగుకు కావలసిన సాయం రైతు భరోసా రూపంలో ఏటా అందింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా రైతు భరోసా కేంద్రాల్లోనే ఎరువులు అందేవి. పంట సాగుకు కష్టం తెలియలేదు. కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు అందుతుందన్నారు. ఏడాది అవుతోంది ఒక్క పైసా అందలేదు.

– నాగభూషణం, రైతు, నాగరాజకుప్పం, నగరి మండలం

నాడు రుణాలు అందేవి



గత ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా వచ్చింది. విత్తనాలు , ఎరువులు రైతు భరోసా కేంద్రంలోనే అందాయి. ఎరువుల కోసం పెట్టే ప్రయాణ ఖర్చులు మిగిలాయి. తరచూ వ్యవసాయ సిబ్బంది పంట పొలాలను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు ఇస్తూ వచ్చారు. పంట రుణాలు ఇవ్వడంతో అప్పుల బాధ లేకుండా పోయింది. దీంతో వ్యవసాయం చేయడం ఆసక్తిగా ఉండేది.

– ఉమాపతి, వడమాలపేట

యోగా యాప్‌లో నమోదుకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రజలందరూ యోగా యాప్‌లో నమోదు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై అవగాహన పెంచేందుకు మండల , గ్రామస్థాయి వరకు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని (మే 21 నుంచి జూన్ 21) వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన కలిగించేలా టీటీటీ. డౌజ్బుధీజిట్బ్.ౡః జౌరి. జీ లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. నేటి నుంచి గ్రామస్థాయిలో యోగా పోటీలు ప్రారంభించాలన్నారు. 4756 మంది యోగా శిక్షకులుగా నమోదయ్యారన్నారు. అదే విధంగా జిల్లాలో 1,66,713 మంది ప్రజలు యాప్ లో నమోదయ్యారని చెప్పారు. జూన్ 21 నాటికి ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన కలిగి, సాధన చేసే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

– సినిమా టికెట్ కంటే పాప్ కార్న్ ధరే ఎక్కువ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లపై రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. కొన్ని థియేటర్లకు లైసెన్సు లేకుండా నడుస్తుంటే మరికొన్ని ఫైర్ సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్నారు. కొత్త థియేటర్లతో పోలిస్తే పాత థియేటర్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అధికారులు తనిఖీలో బట్టబయలైంది. ప్రేక్షకులకు కనీసం తాగునీరు అందుబాటులో లేదని, మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతూ అధ్వాన్నంగా ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనానికి రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్నట్లు తనిఖీలో గుర్తించారు. చిత్తూరు నగరంలో మొత్తం 6 థియేటర్లను రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో రెండు థియేటర్లల్లో ఫైర్ సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. బయట రూ.10 అమ్మే పాప్ కార్న్ థియేటర్‌లో రూ.100గా ఉన్నట్లు గుర్తించారు. వాటర్ బాటిల్ కూడా ఎమ్మార్పీ కన్నా అధికంగా విక్రయిస్తున్నారని గుర్తించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు, శానిటేషన్ సర్టిఫికెట్లు లేవని తనిఖీలో బయటపడిందన్నారు.

క్లుప్తంగా

'పూతలపట్టు పోలీసులు వేధిస్తున్నారు'


మాట్లాడుతున్న భానుప్రకాష్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పోలీసులు తనను అకారణంగా వేధిస్తున్నారని పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డిపల్లెకు చెందిన భానుప్రకాష్ ఆరోపించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 14వ తేదీన గ్రామానికి చెందిన ఫీల్డ్ ఆఫీసర్ ఆదెమ్మ తమ గ్రామంలో బాలకార్మికుల చేత పనిచేయించారని, ఈ విషయాన్ని ఫొటోలతో సహా పీడీకి ఫిర్యాదు చేశానన్నారు. తర్వాత 21వ తేదీ పూతలపట్టు పోలీసులు తనను స్టేషన్‌కు రమ్మన్నారని చెప్పారు. తాను స్టేషన్‌కు వెళ్తే ఏ వివరాలు చెప్పకుండా.... అకారణంగా రెండు రోజులు స్టేషన్‌లో కూర్చోబెట్టారని చెప్పారు. తనను ఎందుకు స్టేషన్‌లో కూర్చోబెట్టారని అడిగితే 'ఫీల్డ్ ఆఫీసర్ పైనే ఫిర్యాదు చేస్తావా' అంటూ తనను దుర్భాషలాడారని ఆరోపించారు. తనపై ఏ కేసు పెట్టారని ఆర్టీఐ కింద అర్జీ ఇచ్చినా పోలీసులు సరైన సమాధానం ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశానని చెప్పారు.

నేటి నుంచి రైతులకు సాంకేతికతపై అవగాహన


శ్రీనివాసులు, శాస్త్రవేత్త

రేణిగుంట : వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై గురువారం నుంచి అవగాహన కల్పించనున్నట్లు రాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఖరీఫ్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినియోగించాల్సిన టెక్నాలజీని వివరించనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్వీయూ ఎగ్జామినేషన్ డీన్‌గా సురేంద్రబాబు


వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సురేంద్రబాబు

తిరుపతి సిటీ: ఎస్వీయూ లైబ్రరీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కె.సురేంద్రబాబును వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్‌గా నియమిస్తూ వీసీ అప్పారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్రబాబు వీసీ చాంబర్‌లో వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్ కిషోర్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

వృద్ధురాలికి గాయాలు

పాకాల : మండలంలోని ఇరుగురురంగయ్యగారిపల్లె వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న మరియమ్మ అనే వృద్ధురాలిని 104 వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియమ్మ కుడి కాలు విరిగింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీని పై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


కర్ణాటకలోని పెట్రోల్ బంకులో ధరలు



కుప్పంలోని పెట్రోల్ బంక్‌లో ధరలు

తగ్గిస్తారా.. తప్పు ఒప్పుకుంటారా?


నినాదాలు చేస్తున్న అభినయ్, వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి దూకుడుకు కూటమి ప్రభుత్వం నానా అవస్థలు పడుతోంది. ఎన్నికల హామీల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్న సర్కారును నిత్యం ఇరుకున పెడుతుండడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. మొన్నటికి మొన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై వినూత్న రీతిలో తెలిపిన నిరసనగా సమాధానం చెప్పుకోలేక సతమతమైంది. తర్వాత సూపర్ సిక్స్ హామీలను క్షేత్రస్థాయిలో ఎండగట్టడంతో కూటమి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. ఈ క్రమంలోనే యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ నాటకీయంగా చూపించిన పెట్రో ధరల విషయాలను గుర్తుచేస్తూ ఇరుకున పెట్టడంతో ఏం చేయాలో తెలియక తలపట్టుకుంటోంది.

- యువగళం హామీ హామీ అమలు చేయాలి
- పెట్రో ధరలు వెంటనే తగ్గించాలి
- లేకుంటే ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నారా లోకేష్‌కు భూమన అభినయ్ డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలంటే నేతలు మాట ఇస్తే దాని మీద నిలబడాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో యువగళం సందర్భంగా నారా లోకేష్ కర్ణాటక, ఆంధ్రలో పెట్రో ధరల మధ్య తేడాను చూపుతూ విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పెట్రో ధరలు తగ్గిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ సదరు హామీ అమలు కాకపోవడంతో భూమన అభినయ్ మండిపడ్డారు. బుధవారం వేకువజామున కర్ణాటకలో లోకేష్ వెళ్లిన పెట్రోల్ బంక్‌కే వెళ్లి పెట్రోల్ పట్టించుకున్నారు. ధర ఎంత ఉందో బహిరంగంగా ప్రదర్శించారు. వెంటనే కుప్పంలో లోకేష్ వెళ్లిన బంక్‌లోనే పెట్రోల్ తీసుకుని ధరను చూపించారు. కర్ణాటక కంటే కుప్పంలో పెట్రోల్ ధర ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన మాట మేరకు వెంటనే పెట్రో ధరలు తగ్గించాలని కోరారు. లేకుంటే తప్పు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'మహా' అగచాట్లు

- మహానాడు సేవలో ఆర్టీసీ
- ప్రయాణికులను పట్టించుకోని ప్రభుత్వం
- తమిళనాడు, బెంగళూరుకు బస్సుల్లేక ఇక్కట్లు
- జిల్లా వ్యాప్తంగా 200 పైగా బస్సుల మళ్లింపు
- 'మెప్మా' ద్వారా బలవంతపు జన సమీకరణ


చిత్తూరు వన్‌టౌన్ పక్కన బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చిత్తూరు అర్బన్ : తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న 'మహానాడు' కార్యక్రమానికి జిల్లా నుంచి దాదాపు 200 ఆర్టీసీ బస్సులను తరలించారు. దీంతో జిల్లాలోని ప్రయాణికులకు మూడు రోజులుగా తీవ్ర అవస్థలు పడ్డారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్టీసీ సంస్థపై.. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు ప్రజల్లో నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి. కడపలో జరుగుతున్న మహానాడుకు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు బస్సుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

మహిళా సంఘాలు రాకపోతే జరిమానా

కడప నగరంలో మూడు రోజులుగా మహానాడు కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇది పూర్తిగా ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం. ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులను మహానాడుకు సభలకు తీసుకెళ్లడానికి ఆయా నియోజకవర్గాల్లోని టీడీపీ ప్రజాప్రతినిధులు పడుతున్న పాట్లు అన్నీ, ఇన్నీ కావు. పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి మున్సిపాలిటీలతో పాటు చిత్తూరు కార్పొరేషన్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు జన సమీకరణ బాధ్యత తీసుకున్నారు. ఇందు కోసం ప్రతి మున్సిపాలిటీలోని మహిళా సంఘాలను మహాసభలకు పంపించారు. ఎవరైనా సభలకు రాకపోతే రూ.300 జరిమానా విధిస్తామని, సంక్షేమ పథకాలు రావని భయపెట్టి మహిళలను కడపకు తరలించారు.

గంటల కొద్దీ నిరీక్షణ

జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల కొరత ఏర్పడటంతో సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని వేలూరులో చదువుకునే విద్యార్థులు, వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లే రోగులు బస్సుల్లేక పడరాని పాట్లు పడ్డారు. గమ్యస్థానానికి బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండుల్లో నిరీక్షించాల్సి వచ్చింది. చిన్న పిల్లలతో వచ్చిన వాళ్లు, మహిళలు, తిరుమల నుంచి తమిళనాడుకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించి, నీరసించిపోయారు. పల్లె వెలుగు నుంచి లగ్జరీ బస్సుల వరకు టీడీపీ సభలకు తరలించడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తిరుపతి, బెంగళూరు, పీలేరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, తవణంపల్లి, పెనుమూరు, జీడీ నెల్లూరు కడప తదితర మార్గాల్లో నిత్యం రద్దీగా కనిపించే ఆర్టీసీ బస్సులు.. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై నిర్మానుష్యంగా కనిపించాయి.

ఆర్టీసీ అధికారుల మౌనం

మహానాడుకు సభలకు చిత్తూరు డిపో నుంచి 90, కుప్పం 50, పుంగనూరు 50, పలమనేరు నుంచి 27 బస్సులను కడపకు మళ్లించారు. జిల్లా మొత్తంగా 200కు పైగా ఆర్టీసీ బస్సుల లోటు రావడంతో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ చర్యలు కల్పించడంలో అధికారులు చేతులెత్తేశారు. జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో బెంగళూరు, వేలూరుకు నిత్యం వందల ట్రిప్పుల్లో ప్రయాణికులను వారి గమ్యాలకు చేరవేయాల్సి ఉంది. బస్టాండుల్లో బస్సుల కోసం ప్రజలు గంటల కొద్దీ నిరీక్షిస్తున్నా, సీట్ల కోసం కుస్తీలు పడుతున్నా అధికారులు మౌనంగా చూస్తూ ఉండిపోయారు. మహానాడుకు ఆర్టీసీ బస్సులు ఇచ్చి తీరాల్సిందేనని ప్రభుత్వం నుంచి అధికారులకు మౌఖిక ఉత్తర్వులు రావడంతో తాము ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఓ జిల్లా అధికారి పేర్కొన్నారు.

వాహన దొంగలు అరెస్ట్

గుడిపాల : ట్రాక్టర్‌తో సహా ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మే 16వ తేదీన అర్ధరాత్రి తుమ్మలవారిపల్లెకు చెందిన బాలకృష్ణమనాయుడు ట్రాక్టర్, ట్రాలీని పానాటూరు వద్ద క్రిష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ ఎదురుగా పార్కింగ్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దీనిపై అతను ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలించిన ట్రాక్టర్ చిత్తూరు మీదుగా కలికిరి వైపు వెళ్లినట్లు గుర్తించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి చీలాపల్లె క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిని విచారించగా అవినాష్‌రెడ్డి(31), నితీష్‌కుమార్‌రెడ్డి(19), మరొక మైనర్ బాలుడుగా గుర్తించామన్నారు. వీరందరూ కలికిరి మండలానికి చెందిన వారుగా గుర్తించారు. వీరిని విచారించగా దొంగలించిన ట్రాక్టర్‌ను తమిళనాడులో అమ్మడానికి ట్రాక్టర్ మీద ఉన్న నంబర్ ప్లేట్ తీసివేసి ఎవరికీ అనుమానం రాకుండా బ్లూ కలర్ పెయింట్ వేసి తమిళనాడులో అమ్మడానికి పోతుండగా వారిని అరెస్ట్ చేశారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసిన రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్, రెండు బజాజ్ పల్సర్, ఒక స్ప్లెండర్ ప్లస్, ఒక ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ట్రాక్టర్ విలువ పది లక్షలు, ద్విచక్ర వాహనాల విలువ రూ.8 లక్షలని తెలిపారు. మైనర్ బాలుడిపై జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 15 కేసులు ఉన్నాయన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర

– రైతు సంఘాలకు కలెక్టర్ హామీ


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తోతాపురి రకం మామిడికి మరో నాలుగు రోజుల్లో గిట్టుబాటు ధర నిర్ణయిస్తామని రైతు సంఘాలకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. మామిడి రైతులకు న్యాయం చేయాలంటూ బుధవారం కలెక్టరేట్ వద్ద మామిడి రైతు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం వారు కలెక్టర్‌కు పలు సమస్యలు వెల్లడించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ.. తోతాపురి మామిడికి కిలోకు రూ.30 గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గుజ్జు యజమానుల నుంచి రూ.20, ప్రభుత్వ ప్రోత్సాహక నిధి నుంచి మరో రూ.10 అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుక మామిడి ఉత్పత్తికి రూ.15 ఖర్చు అవుతోందన్నారు. జిల్లాకు మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. బేనీషా రకం మామిడికి రైతు బజారులలో అమ్మేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఆ మామిడికి కిలోకు రూ.50 చొప్పున గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. సంప్రదింపుల కమిటీలో రైతు సంఘాల ప్రతినిధులకు చోటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, నాయకులు ఆనంద్ నాయుడు, హరిబాబు చౌదరి, మునీశ్వర్ రెడ్డి, భారతి, నాగరాజు నాయుడు, రాజేందర్ రెడ్డి, మస్తానయ్య, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.17,809 కోట్లతో రుణ ప్రణాళిక


వార్షిక రుణప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి
- రుణాల మంజూరులో అలసత్వం వద్దు
- బ్యాంకర్లు కచ్చితంగా రుణ లక్ష్యాలను చేరుకోవాలి
- వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో సంక్షేమం, ఆర్థిక ప్రగతి, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రూ.17,809 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ బుధవారం కలెక్టరేట్‌లో రుణ ప్రణాళికను విడుదల చేశారు. అనంతరం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డీఎల్ఆర్, డీసీసీ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడేలా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు వివిధ రకాల రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా సమగ్రాభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పాటునివ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల్లో భాగంగా నిర్దేశించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు కచ్చితంగా చేరుకోవాలన్నారు.

ఇందులో అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. అదేవిధంగా పంటలకు రుణాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమకు షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ రుణాలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు పరిశ్రమల స్థాపనకు రుణాలను మంజూరు చేయాలన్నారు. స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరు చేసి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏపీ ఆర్‌వో రోహిత్ అగర్వాల్, నాబార్డ్ డీడీఎం సునీల్, ఎల్‌డీఎం హరీష్, డీసీసీ కన్వీనర్ ఇందిరా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

2025–26 వార్షిక రుణ ప్రణాళిక

- 2025–26 సంవత్సరానికి జిల్లా క్రెడిట్ ప్లాన్ ప్రాధాన్యతా రంగంలో మొత్తం క్రెడిట్ వ్యయం రూ.17,809.37 కోట్లు.
- జిల్లా సమగ్రాభివృద్ధి కోసం వివిధ ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు 815145 ఖాతాలకు రుణాలు ఇవ్వడం.
- ప్రాధాన్యత లేని రంగానికి రూ.2,787.17 కోట్లు కేటాయింపు, ఈ మొత్తం క్రెడిట్ వ్యయం రూ.17,809.37 కోట్లు.
- వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు కేటాయింపులు రూ.12,195.27 కోట్లు. ఈ రంగంలో దాదాపు 6.38 లక్షల మంది రైతులు, భూమిలేని కార్మికులకు సహాయం.
- చిన్న – సూక్ష్మ పరిశ్రమల రంగానికి కేటాయింపులు రూ. 2,216.07 కోట్లు.
- ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.220.81 కోట్లు.
- వాణిజ్య బ్యాంకుల వాటా రూ.11,843.43 కోట్లు. ఇది జిల్లా క్రెడిట్ ప్లాన్‌లో 66.50% వాటా.

రోడ్డు రోలర్‌ను ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన తమిళ్ సెల్వన్

విజయపురం : రోడ్డు పక్కన ఆగి ఉన్న రోడ్డు రోలర్‌ను బైక్‌తో ఢీకొని తమిళ్ సెల్వన్ (24) అనే యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం పన్నూరులో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా...ఇష్టకామేశ్వపురం గ్రామానికి చెందిన దొరస్వామి రెండో కుమారుడు తమిళ్ సెల్వన్ సొంత పని నిమిత్తం కనకమ్మసత్రం వెళ్తుండగా పన్నూరు దళితవాడ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న రోడ్డు రోలర్‌ను బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగా తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరానికి చెందిన రవి (41) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మహేశ్వర కథనం మేరకు... చిత్తూరులోని గూలింగ్స్ పేటకు చెందిన రవి ఓ ప్రైవేటు కంపెనీలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు చుట్టు ముట్టడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మేకలు మృతి


మృతి చెందిన మేకలు

పుత్తూరు : మండల పరిధిలోని ఎగువ కనకంపాళెం గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన బుధవారం సాయంత్రం 10 మేకలు మృతి చెందాయి. మేకలు దిగువ కనకంపాళెం గ్రామానికి చెందినవి కాగా వాటి మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతి చెందిన మేకలను గ్రామస్తులు పూడ్చిపెట్టినట్లు సమాచారం.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 82,597 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,803 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

తుడాను సందర్శించిన 'కాగ్'


అధికారుల సమావేశంలో కాగ్ బృందం

తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ను బుధవారం కాగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వీసీ మౌర్య తుడా చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న అకౌంటింగ్ విధానాలను కాగ్ బృందానికి వివరించారు. డిజిటలైజేషన్‌కు తక్షణం చర్యలు చేపట్టాని కాగ్ కమిటీ అధికారులకు సూచించింది. సమావేశంలో అడిషనల్ డిప్యూటీ కాగ్ రీవూ ప్రకాష్, కాగ్ డైరెక్టర్ జనరల్ రష్మీ అగర్వాల్, డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఎన్వీ నిఖిత, సీనియర్ డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఆర్.శ్యామ్, తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


కాంతమ్మ మృతదేహం

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ గెనుంగుట్లపల్లెలో విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. వివరాలు.. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఆన్ చేశారు. అదే సమయంలో ఇంటి గేటును పట్టుకుని ఉన్న కాంతమ్మ(74)కు షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.